సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 8 । మే । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 679 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ముమ్మరంగా పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ వేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
43.2°/25.4°

జిల్లావ్యాప్తంగా మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కరుణించిన వరుణుడు



సోమందేపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

సోమందేపల్లి: భానుడి భగభగలతో అల్లాడిపోయిన జిల్లా వాసులను వరుణుడు కరుణించాడు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ధర్మవరంలో మోస్తరు వర్షం కురిసింది. మడకశిర, హిందూపురం డివిజన్ వ్యాప్తంగా చిరుజల్లులు కురిశాయి. పుట్టపర్తిలో ఈదురుగాలులు వీచాయి. మిగతా ప్రాంతాల్లోనూ వాతావరణం చల్లబడింది.

కొబ్బరి చెట్టుపై పిడుగు



కొబ్బరి చెట్టుపై నిప్పురవ్వలు అంటుకున్న దృశ్యం

అమరాపురం: మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. హలుకూరు గ్రామంలో మీసాల నాగన్న చెందిన తోటలోని రెండు కొబ్బరి చెట్లపై పిడుగు పడటంతో అగ్గిరాజుకుని మంటలు ఎగసిపడ్డాయి. అయితే తోటలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వీఆర్‌కు ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు

పుట్టపర్తి టౌన్: రొళ్ల మండలం పిల్లిగుండ్ల చెక్ పోస్టు వద్ద ఘర్షణ పడిన కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం డ్యూటీ విషయంగా కానిస్టేబుళ్లు శివకుమార్, నారాయణస్వామినాయక్ ఘర్షణ పడి కొట్టుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నివేదికను సీఐ రాజుకుమార్ అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఇద్దరు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఎన్నికల అనంతరం పూర్తి స్థాయి విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు తొలివిడత కౌన్సెలింగ్‌కు అర్హత కల్గిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏ ఐటీఐలో చేరాలకున్నారో ఆన్‌లైన్‌లోనే ఎంచుకోవచ్చని వెల్లడించారు. జూన్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ కింది ట్రేడ్‌లలో అడ్మిషన్లు చేపడతారు. కోపా (ఏడాది కోర్సు), డి/మాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్ (రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (రెండేళ్లు), ఫిట్టర్ (రెండేళ్లు), మెచినిస్ట్ గ్రైండర్ (రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (రెండేళ్లు), మెకానిక్ డీజిల్ (ఏడాది), టర్నర్ (రెండేళ్లు), వైర్‌మెన్ (రెండేళ్లు), వెల్డర్ (ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్ (రెండేళ్లు), డ్రెస్ మేకింగ్ (ఏడాది), ప్లంబర్ (ఏడాది), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (రెండేళ్లు), ఐసీటీఎస్ఎం (రెండేళ్లు), మెచినిస్ట్ (రెండేళ్లు).

ఎస్కేయూకు రూ.18.97 కోట్ల అదనపు నిధులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అదనపు బ్లాక్‌గ్రాంట్ కింద రూ.18.97 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జూలై వరకూ వర్సిటీ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించడానికి వీలుగా అదనపు బ్లాక్‌గ్రాంట్ నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి సుభాష్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఈ మొత్తాన్ని కేటాయించారు.

‘పోస్టల్’ కోసం పచ్చరచ్చ

అభిమానంతో అండగా నిలిచేవారు ఒక్కరూ కనిపించలేదు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఛీత్కరిస్తున్నారు. ఉద్యోగులైనా కనికరిస్తారంటే మద్దతు ఇవ్వలేం ‘బాబు’ అంటున్నారు. ఏం చేయాలో తెలియని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం తొలుత ప్రలోభాలకు తెరతీశారు. అక్కడికీ వినని వారిని భయపెట్టారు. అడ్డువచ్చిన అధికారులనూ మీ కథ తేలుస్తామంటూ బెదిరించారు. మంగళవారం జిల్లాలోని పలు ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ‘పచ్చ’మంద రచ్చచేసింది.

- ఉద్యోగులకు ప్రలోభాల వర్షం
- వాహనాలు సమకూర్చి.. విందులిచ్చిన టీడీపీ నేతలు
- ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద మకాం వేసి బెదిరింపులు
- పెనుకొండలో ‘నీ కథ తేలుస్తా’ అంటూ సీఐకి ‘తమ్ముళ్ల’ వార్నింగ్
- పుట్టపర్తిలో మీడియా ముసుగులో హల్‌చల్
- కదిరిలో యథేచ్ఛగా కొనసాగిన నిబంధనల ఉల్లంఘన



పెనుకొండ ఫెసిలిటేషన్ కేంద్రం సమీపంలో మోహరించిన టీడీపీ శ్రేణులకు వెళ్లిపోవాలని సూచిస్తున్న పోలీసులు



సీఐ యుగంధర్‌కు వార్నింగ్ ఇస్తున్న టీడీపీ నాయకుడు రమేష్



పెనుకొండ ఫెసిలిటేషన్ కేంద్రం సమీపంలోని కాంప్లెక్సు వద్ద పోలీసులతో టీడీపీ నేతల ఘర్షణ

పెనుకొండ: ‘నెలరోజులు ఆగు నీ కథ తేలుస్తా’ అంటూ మునిమడుగుకు చెందిన రమేష్ నాయుడు ఏకంగా సీఐ యుగంధర్‌కే వార్నింగ్ ఇచ్చాడు. పోస్టల్ బ్యాలెట్ కోసం పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద మంగళవారం టీడీపీ నేతలు హంగామా చేయగా, ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉదయమే ఉద్యోగులు భారీగా తరలిరాగా, వారిని ప్రలోభాలకు గురిచేసేందుకు టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. తొలుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వరరావు నాలుగైదు కార్లలో మందీమార్బలంతో ఫెసిలిటేషన్ కేంద్రానికి వచ్చి హంగామా చేశారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి కేంద్రం వద్దకు కారులో రాగా, అక్కడే ఉన్న వెంకటేశ్వరరావు, మరి కొందరు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో చరణ్‌రెడ్డి కారును బయటే నిలిపి ఫెసిలిటేషన్ కేంద్రంలోకి వెళ్లారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జయశంకరరెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సమీపంలోనే ఉన్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలి వచ్చి ఘర్షణకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు వారిని అక్కడి నుంచి బయటకు పంపారు.

సీఐకే వార్నింగ్ ఇచ్చిన పచ్చమూక

ఫెసిలిటేషన్ కేంద్రం సమీపంలోని ఓ కాంప్లెక్స్ రూంలో పచ్చమూక మకాం వేసి ఉండగా, అక్కడి నుంచి వెళ్లిపోయాలని సీఐ యుగంధర్ సూచించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పోలీసులపై తిరుగుబాటు చేశారు. అయినా సంయమనం పాటించిన పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి గదికి తాళం వేశారు. మధ్యాహ్నం మంత్రి ఉషశ్రీచరణ్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్దకు రాగా, టీడీపీ శ్రేణులు భారీగా గుమిగూడారు. అక్కడి నుంచి వెళ్లపోవాలని సూచించిన పోలీసులతో మునిమడుగుకు చెందిన చిన వెంకటరాముడు, రమేష్ నాయుడు వాగ్వాదానికి దిగారు. సీఐ యుగంధర్‌ను చుట్టుముట్టారు. ఈ సమయంలోనే రమేష్ నాయుడు సీఐని ఉద్దేశించి ‘మరో నెల రోజులు ఉండు నీ కథ తేలుస్తాం’ అంటూ వార్నింగ్ ఇచ్చారు. దీంతో పోలీసులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. వెంటనే ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణులను దూరంగా పంపించారు. అనంతరం ఉద్యోగులు భారీ ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ ఉద్యోగులే ఓట్లు వేసిన వైనం!

పుట్టపర్తి అర్బన్: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాలన్న ఉద్దేశంతో ఈసారి ఎన్నికల కమిషన్ ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించింది. దీంతో వివిధ డిపార్టుమెంట్‌ల వారికి పోస్టల్ బ్యాలెట్ దక్కింది. ఈ క్రమంలో మంగళవారం పుట్టపర్తి ఫెసిలిటేషన్ సెంటర్‌లో సచివాలయాలు, ఆర్‌బీకే సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చారు. అయితే అంగన్‌వాడీలు, సచివాలయాల సిబ్బంది, ఆర్బీకే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కొత్త కావడంతో పోలింగ్ కేంద్రంలోని ఏపీఓలు వారి ఫాంలు నింపడంతో పాటు ఉద్యోగితో సంబంధం లేకుండా ఇష్టమొచ్చిన పార్టీకి ఓటు వేసినట్లు ఉద్యోగులు వాపోయారు.

ఓటింగ్‌ను పరిశీలించిన అభ్యర్థులు

పుట్టపర్తి సమీపంలోని చిన్నపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి తదితరులు పరిశీలించారు.

కదిరిలోనూ ‘పచ్చ’ మంద హంగామా

కదిరి టౌన్: పోస్టల్ బ్యాలెట్‌ల వినియోగం కోసం కదిరిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ లోనూ మంగళవారం పచ్చ మంద హంగామా చేసింది. నిబంధనలకు విరుద్ధంగా బూత్ వద్దే కాపు కాచిన టీడీపీ నాయకులు ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులకు ప్రలోభపెట్టారు. బహిరంగంగానే డబ్బులు పంపిణీ చేస్తూ హంగామా చేశారు. పోలీస్ అధికారులు పలుమార్లు హెచ్చరించినా కనీసం వినిపించుకోలేదు. ఇక కదిరి నియోజకవర్గంలో మొత్తం 2,989 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, సోమవారం 806 మంది, మంగళవారం 1,624 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు కదిరి రిటర్నింగ్ అధికారి వంశీకృష్ణ తెలిపారు.

పోలింగ్ కేంద్రంలోనే తిష్ట

పుట్టపర్తి అర్బన్: దొడ్డిదారిలో ఓట్లు రాబట్టుకునేందుకు సిద్ధమైన టీడీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం ప్రలోభాలకు తెరతీశారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద కాపుకాసి ఉద్యోగులకు డబ్బు ఎర వేస్తున్నారు. ఇక పుట్టపర్తిలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి ఓటమి ఖాయంగా తేలడంతో ఆ పార్టీ నేతలు పోస్టల్ బ్యాలెట్లు దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు రెండోరోజు మంగళవారం ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ టీడీపీ నాయకులు ఉద్యోగులతో అంటకాగారు. ఇక పుట్టపర్తిలోని ఫెసిలిటేషన్ కేంద్రానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి వివరాలు ముందుగానే సేకరించి వాహనాలు సమకూర్చారు. మార్గ మధ్యంలో విందు ఏర్పాటు చేయడంతో పాటు కొంత నగదు కూడా అందించినట్లు ఉద్యోగులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



పుట్టపర్తి ఫెసిలిటేషన్ కేంద్రం ఆవరణలో గుమికూడిన టీడీపీ నాయకులు, ఉద్యోగులు

ఫెసిలిటేషన్ కేంద్రానికి వంద మీటర్ల లోపే టీడీపీ నాయకులు, వారికి మద్దతుగా నిలిచిన కొందరు ఉద్యోగులు మంతనాలు జరిపారు.

పోలీసులతో వాగ్వాదం..

పచ్చ మీడియా ముసుగులో ఫెసిలిటేషన్ కేంద్రంలోకి విచ్చేసిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పీఏలు హల్ చల్ చేశారు. లోపల ఇతరులు ఉండకూడదని ఆర్ఓ, పోలీస్ అధికారులు హెచ్చరించగా, వారితోనే వాగ్వాదానికి దిగారు. ఓటర్లతో మాట్లాడి వారి ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు సేకరించారు. ఓటేసి బయటకు రాగానే మీ అకౌంట్‌లో డబ్బు జమచేస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. టీడీపీ ప్రచార వాహనం సైతం ఫెసిలిటేషన్ కేంద్రం వద్దే ఉంచారు.

హెల్ప్‌డెస్క్‌లు సద్వినియోగం చేసుకోండి



ఓటర్ల క్యూను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



వసతి లేక పోవడంతో మట్టిపైనే కూర్చున్న ఓటర్లు

- బ్యాలెట్ ఓటు వేసే ఉద్యోగులకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచన

పుట్టపర్తి అర్బన్: పోస్టల్ బ్యాలెట్ వేసే ఉద్యోగులు ఫెసిలిటేషన్ కేంద్రాల్లోని హెల్ప్‌డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన ఫెసిలిటేషన్ కేంద్రాలను సందర్శించారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఫాంలు పూరించడం, ఓటరు ఐడీ నంబర్, పీఓటీ నంబర్ తెలుసుకోలేక పడుతున్న వారితో మాట్లాడారు. కొందరు తమ సన్నిహితుల వద్దకు వెళ్లి ఫాంలు పూరిస్తుండటాన్ని గమనించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఫెసిలిటేషన్ కేంద్రాల్లోని హెల్క్‌డెస్కులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వచ్చే ఉద్యోగులకు మజ్జిగ, తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కుర్చీలు, షామియానాలు ఏర్పాటు చేయించాలన్నారు. కలెక్టర్ వెంట పుట్టపర్తి రిటర్నింగ్ ఆఫీసర్ భాగ్యరేఖ ఉన్నారు. పుట్టపర్తి ఫెసిలిటేషన్ కేంద్రంలో 1,228 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు ఆర్ఓ తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రతి ఒక్క ఉద్యోగీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలన్నారు.

రేపు కళ్యాణదుర్గానికి సీఎం జగన్






హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పార్టీ నేతలు తిప్పేస్వామి, ఉమా

కళ్యాణదుర్గం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 9న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళ్యాణదుర్గం రానున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన మంచిని వివరించనున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తలారి రంగయ్య, శంకరనారాయణను ఆశీర్వదించాలని ప్రజలను కోరనున్నారు. సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో మంగళవారం సభాస్థలి, హెలిప్యాడ్‌లను ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నేతలు బోయ తిప్పేస్వామి, ఉమా మహేశ్వర నాయుడు, డీఎస్పీ బి.శ్రీనివాసులు పరిశీలించారు. సీఎం సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులు, అభిమానులకు అనుకూలంగా ఉండేలా పట్టణంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. కంబదూరు రోడ్డులోని ఏపీ మోడల్ పాఠశాలకు ఎదురుగా హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

లోకలా.. నాన్ లోకలా?

- మలుపులు తిరుగుతున్న మడకశిర రాజకీయం
- స్థానికేతరుడు, టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజును వ్యతిరేకిస్తున్న జనం
- స్థానికుడైన ఈరలక్కప్పకే మా మద్దతు అంటూ స్పష్టం
- గతంలో స్థానికేతరులను గెలిపించి నష్టపోయామంటున్న వైనం



ఈరలక్కప్ప

మడకశిర కోట

ఎంఎస్ రాజు

మడకశిర: ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన మడకశిర రాజకీయం రసవత్తరంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ....లోకల్, నాన్‌లోకల్ నినాదం ఊపందుకుంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప పక్కా లోకల్ కాగా... టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు నాన్ లోకల్. దీంతో నియోజకవర్గ ప్రజలంతా గతంలో నాన్ లోకల్‌ను గెలిపించి పడిన ఇబ్బందులను గుర్తు చేసుకుంటున్నారు. లోకల్‌కే తమ మద్దతు అంటూ స్పష్టం చేస్తున్నారు.

ఎంఎస్ రాజు నాన్ లోకల్..

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన ఎంఎస్ రాజును టీడీపీ అధినేత చంద్రబాబు మడకశిర టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనకు మడకశిర నియోజకవర్గ ప్రజలతో ఏమాత్రం సంబంధాలు లేవు. అసలు మడకశిర నియోజకవర్గంపై కనీస అవగాహన కూడా లేదు. టీడీపీలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎంఎస్ రాజుకు మడకశిర టికెట్ కేటాయించారు. స్థానికులైన ఎంతో మంది దళిత నాయకులు దరఖాస్తు చేసుకున్నా... టీడీపీ హైకమాండ్ స్థానికేతరుడు ఎంఎస్ రాజుకు టికెట్ కేటాయించడంతో ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. ‘లోకల్ ముద్దు...నాన్ లోకల్ వద్దు’ అంటూ టీడీపీ కార్యకర్తలే ఎంఎస్ రాజుకు వ్యతిరేకంగా ఆందోళనలు కూడా చేశారు. అయినా చంద్రబాబు స్థానికేతరుడికే మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో మడకశిర ప్రజలు నాన్‌లోకల్ వద్దంటే వద్దంటున్నారు. గతంలో స్థానికేతరులను గెలిపించి తీవ్రంగా నష్టపోయామని, మరోసారి ఆ తప్పు చేయబోమంటున్నారు.

ఈరలక్కప్ప... పక్కా లోకల్

గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి ఈరలక్కప్పకు వైఎస్సార్ సీపీ టికెట్ ఇచ్చింది. ఆయన నిరుపేద. ప్రభుత్వం ఇచ్చిన గృహంలో తల్లితో కలిసి ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలంతా మెచ్చుకుంటున్నారు. రాజకీయాల్లోకి నిరుపేదలు కూడా రావాలన్న సంకల్పం మంచిదంటున్నారు. ఈరలక్కప్ప 2006–2011 మధ్య గుడిబండ సర్పంచ్‌గా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేవారు. అందువల్లే ప్రస్తుతం ఈరలక్కప్ప ఏ గ్రామానికి వెళ్లినా... ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. ఈరలక్కప్ప ఎమ్మెల్యే అయితే అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తారని చెబుతున్నారు. సామాన్యుడికి జగన్ అవకాశం ఇచ్చారని, తప్పకుండా అసెంబ్లీకి పంపుతామంటున్నారు.

ఎస్సీ సామాజిక వర్గం నుంచే రాజుపై తీవ్ర వ్యతిరేకత..

టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజును ఆ పార్టీలోని ఎస్సీ వర్గానికి చెందిన నాయకులే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన తమను కాదని స్థానికేతరుడు, వివాదాస్పదుడైన ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీ టికెట్ కోసం ఎస్సీ వర్గానికే చెందిన స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మంజునాథ్, సుబ్బరాయుడు, జయకుమార్, కృష్ణమూర్తి, మల్లికార్జున తదితరులు ప్రయత్నించారు. అయితే టీడీపీ హైకమాండ్ మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కు తొలుత టికెట్ కేటాయించింది. దాదాపు 50 రోజుల పాటు సునీల్ నియోజకవర్గంలో ప్రచారం చేశారు. చివరకు టీడీపీ తరపున నామినేషన్ కూడా వేశారు. అయితే చివరి నిమిషంలో టీడీపీ అధినేత చంద్రబాబు సునీల్‌ను పక్కనపెట్టి ఎంఎస్ రాజుకు బీఫాం ఇచ్చారు. దీంతో స్థానిక ఎస్సీ వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈక్రమంలోనే కొందరు స్థానిక ఎస్సీ సంఘాల నాయకులు ఎంఎస్ రాజుకు వ్యతిరేకంగా ప్రకటనలు కూడా చేశారు. ఎంఎస్ రాజుపై 54 కేసులు ఉన్నాయని, అతను గెలిచినా పెద్దగా ఉపయోగం ఉండదంటున్నారు. వాయిదాల కోసం కోర్టుల చుట్టూ తిరగడానికే సమయం సరిపోతుందని చెబుతున్నారు. ప్రజలు కూడా ఆలోచించి స్థానికులకే పట్టం కట్టాలని కోరుతున్నారు.

1983లో నాన్ లోకల్ అభ్యర్థిని చిత్తుగా ఓడించిన ప్రజలు..

1983లో మడకశిర టీడీపీ అభ్యర్థిగా అనంతపురానికి చెందిన జగదోద్ధారకగుప్తా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పలువురు స్థానికులు టికెట్ ఆశించినా ఎన్టీఆర్ పట్టించుకోలేదు. దీంతో మడకశిర వాసులు రగిలి పోయారు. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ గాలి పెద్ద ఎత్తున వీచినా...మడకశిరలో మాత్రం స్థానికేతరుడైన టీడీపీ అభ్యర్థి జగదోద్ధారకగుప్తా చిత్తుగా ఓడిపోయారు. డిపాజిట్ కూడా దక్కలేదు. ప్రస్తుతం ఎంఎస్ రాజుకు ఇదే పరిస్థితి ఎదురవుతుందనే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

స్థానికేతరుల హయాంలో అభివృద్ధికి నోచుకోని మడకశిర..

మడకశిర 1962 నుంచి 1972 వరకు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా కొనసాగింది. ఆ పదేళ్లలో మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. 1967, 1972 ఎన్నికల్లో స్థానికేతరులు మడకశిర నుంచి పోటీ చేశారు. 1967 స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన స్థానికేతరుడైన ఎంటీ రాజారావు గెలుపొందారు. అదే విధంగా 1972లో స్థానికేతరుడు యల్లప్ప కాంగ్రెస్ తరుపున పోటీ చేసి గెలుపొందారు. కానీ వారిద్దరూ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారు. అసలు నియోజకవర్గ ప్రజలకే అందుబాటులో ఉండేవారు కాదు. దీంతో చిన్నచిన్న సమస్యలు కూడా ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తాజాగా టీడీపీ స్థానికేతరుడైన ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడంతో నాటి రోజులను నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

ముమ్మరంగా పోస్టల్ బ్యాలెట్



పోస్టల్ బ్యాలెట్‌ను డబ్బాలోకి వేస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం ఉదయం పోలీసులు, హోంగార్డులు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఫెసిలిటీ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అడిసనల్ ఎస్పీ విష్ణు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 1,211 మంది పోలీసులు, హోంగార్డులు పోస్టల్ బ్యాలెట్లకు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. మరో రెండు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ అందుబాటులో ఉంటుందని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తొలిరోజు 443 మంది పోలీసులు, హోంగార్డులు పోస్టల్ బ్యాలెట్లను సద్వినియోగం చేసుకున్నారన్నారు.

గ్రోబ్ కంపెనీ ప్రారంభం



పరిశ్రమ ప్రారంభంలో పాల్గొన్న నిర్వాహకులు, ఉద్యోగులు

సోమందేపల్లి: జర్మనీకి చెందిన టూల్స్ ఉత్పత్తి కంపెనీ 'గ్రోబ్' తన శాఖను సోమందేపల్లి మండలం పేటకుంట సమీపంలోని పారిశ్రామిక వాడలో మంగళవారం ప్రారంభించింది. ఆ కంపెనీ ఎండీ ఎల్.జె.నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ ద్వారా 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ.550 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఆటో మొబైల్ రంగంలో గ్రోబ్ కంపెనీ ద్వారా వివిధ పరికరాలు ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే ఆరు శాఖలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ క్రిస్టియన్ గ్రోబ్, సీఐఓ వాన్క్ మ్లిర్ పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మ(48) ఆత్మహత్య చేసుకుంది. భర్తతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



గోరంట్ల మండలం బూదిదగడ్డపల్లి రోడ్డుషో లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేవీ ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ



కదిరిలో బస్సు ప్రయాణికులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహమ్మద్



మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని బేగార్లపల్లిలో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ఫ్యాన్ గుర్తు మరవొద్దు

ఆరు రోజుల్లో ఎన్నికల పోలింగ్ జరగనుండడంతో ప్రచారాన్ని అభ్యర్థులు ముమ్మరం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు చుట్టి వచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఓ వైపు ఎండలు మండుతున్నా.. అదే స్థాయిలో ప్రచారాన్ని కొనసాగించారు. అవ్వా మన గుర్తు ఫ్యాన్... తాతా మన గుర్తు ఫ్యాన్. అక్కా ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి. అన్నా ఫ్యాన్ గుర్తు మరవొద్దు అంటూ ఓటు అభ్యర్థిస్తూ ముందుకు సాగారు. – సాక్షి బృందం



ధర్మవరంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



ఆత్మకూరు మండలం వేపచెర్ల దిగువతండాలో అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఊరేగిస్తున్న దృశ్యం



నల్లమాడ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



హిందూపురం మున్సిపాలిటీలోని ముదిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ

టీడీపీ ప్రచారంలో యానిమేటర్



ప్రచారంలో పాల్గొన్న పార్థసారథి (వృత్తంలో)

తలుపుల: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ ఎన్నికల ప్రచారంలో కొరుగుట్టుపల్లి యానిమేటర్ పార్థసారథి పాల్గొన్నారు. ఆ పార్టీ మండల కన్వీనర్ ముబారక్, మాజీ ఎంపీపీ మనోహర్‌రెడ్డితో కలసి ఇంటింటికీ తిరిగి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

యువకుడి బలవన్మరణం

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన అనిల్‌కుమార్ (28) కొంత కాలంగా వ్యసనాలకు బానిసగా మారి జులాయిగా తిరగసాగాడు. తన అవసరాలు తీర్చుకునేందుకు డబ్బు సమకూరక పోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి రాంపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య షాలిని, ఎనిమిది నెలల వయసున్న కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(38) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అవివాహితుడైన లక్ష్మీనారాయణకు కుటుంబసభ్యులు పలు సంబంధాలు చూసినా ఏవీ కుదరలేదు. దీంతో ఆయన మద్యానికి బానిసై జీవితం మీద విరక్తితో మంగళవారం తెల్లవారుజామున తాను కట్టుకున్న లుంగీతో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గంగాధరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం





శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బొమ్మనహాళ్: స్థానికంగా వెలసిన వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి వేంటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామిని గరుడ వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీలో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

సీఎం జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి



జస్టిస్ ఈశ్వరయ్యను సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

అనంతపురం కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే బడుగుల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఓ హోటల్‌లో అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యను బీసీ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించారన్నారు. కావున ప్రతిఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ ఆల్మెన్‌రాజు, బీసీ సంఘం ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ భాస్కర్ బాబు, బీసీ సంఘాల నాయకులు రజక అనిల్‌కుమార్, వాల్మీకి హరి, లక్ష్మీనారాయణ, రామ్మోహన్ గౌడ్, బెస్త వెంకటేష్, వాల్మీకి నగేష్, శివ, కురుబ విష్ణువర్ధన్, తేజ, వంశీ, బాలాజీ, టీసీ నాగేంద్ర, లబ్బే రాఘవ, బోనాల రఫి తదితరులు పాల్గొన్నారు.

నా మంచితనాన్ని.. చేతగానితనంగా తీసుకోవద్దు

- టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వార్నింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: 'రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌కు చోటు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రజల కోసం ఎన్నోసార్లు తల దించుకున్నా. అయినా టీడీపీ నాయకులు రెచ్చగొడుతూనే ఉన్నారు. గ్రామాల్లో మళ్లీ కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. నా మంచితనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు' అంటూ టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిటాల సునీత కేవలం అధికారం, పదవి కోసమే రాజకీయాలు చేస్తున్నారని, ఇక్కడ టికెట్ రాదన్న భయంతో ధర్మవరం, పెనుకొండలోనూ టికెట్ కోసం ప్రయత్నించారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేయడం, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం పరిటాల కుటుంబానికి తెలియదన్నారు. స్థానికుడినైన తన నరనరాల్లో నియోజకవర్గ ప్రజలపై ప్రేమ ఉందన్నారు. ఓడినా... గెలిచినా తాను ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.50 కోట్ల తన సొంత డబ్బు వెచ్చించినట్లు గుర్తు చేశారు. ప్రజాసేవ చేయడంలో తన కాలి గోటికి కూడా పరిటాల కుటుంబం సరితూగదన్నారు. ఓటమి తప్పదని తెలుసుకున్న పరిటాల కుటుంబం చివరకు రంగంలోకి రౌడీ మూకలను దించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏమైనా జరిగితే ఆ రౌడీలను ఊర్లు విడిపిస్తానని హెచ్చరించారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించిన యువకుడు అనిల్‌ని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మంగళవారం ఉదయం కల్లూరు – తరిమెల క్రాస్‌లో తచ్చాడుతుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న గౌతమి వేధింపులు తాళలేక ఆశా కార్యకర్త శబరి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... రోజూ ఏదోక నెపంతో తనను దుర్భాషలాడుతుండడంతో శబరి కుదేలైంది. ఈ క్రమంలో మంగళవారం మరోసారి గౌతమి దుర్భాషలాడడంతో తీవ్ర మనస్తాపం చెందిన శబరి ఇంటికి చేరుకుని పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ కదిరి డివిజన్ ఇన్‌చార్జ్ సాంబశివ వెంటనే మెడికల్ ఆఫీసర్ శ్రుతితో చర్చించారు. బాధితురాలి తరఫున దాదాపు నాలుగు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకుల పిలుపు



మాట్లాడుతున్న కేవీ రమణ, కొర్రపాడు హుస్సేన్‌పీరా తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా వాసులను వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ, జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, కార్మికులకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఉద్యోగులకు జీతాలు అందించారని, 27 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మునిసిపల్ ఉద్యోగులు అడగక ముందే వారి జీతాలు పెంచారని గుర్తు చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు నడపడంతో చంద్రబాబును మించిన వారు లేరని మండిపడ్డారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, నాయకులు కె.సూర్యనారాయణ రెడ్డి, కె.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై అకారణంగా ఎస్‌ఐ దాడి

గుడిబండ: పోలీసుల విచారణను ఆసక్తిగా గమనిస్తున్న వ్యక్తిపై ఎస్‌ఐ దురుసుగా వ్యవహరిస్తూ దాడి చేశారు. వివరాలు.... గుడిబండ మండలం నాగేపల్లిలో సోమవారం సాయంత్రం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అయితే ప్రచారానికి జన స్పందన లేకపోవడంతో వారంతా వెనుదిరిగారు. కాసేపటి తర్వాత వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆ సమయంలో ఆయనను ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ ప్రజాదరణను చూసి ఓర్వలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్త జగన్నాథ్‌ను టీడీపీ నాయకులు శ్రీధర్, గిరేతిమ్మప్ప, గిరీష్, సురేష్ దాడి చేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఉదయం నాగేపల్లిలో పోలీసులు విచారణ చేపట్టారు. ఆ సమయంలో ఎంపీటీసీ శాంతమ్మ భర్త సత్యనారాయణతో పాటు పలువురు గ్రామస్తులు గుమిగూడి ఆసక్తిగా గమనిస్తుండగా ఎస్‌ఐ మునిప్రతాప్ గద్దించారు. అక్కడితో ఆగకుండా సత్యనారాయణపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ యంజారేగౌడ్, నాయకులు ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బైకుల చోరీ కేసులో ఐదుగురికి జైలు



అనంతపురం: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం ఏజేఎఫ్‌సీ న్యాయమూర్తి ప్రతిభ తీర్పు వెలువరించారు. అనంతపురం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు అపహరించిన కేసులో జి.అశోక్ (అనంతపురం), ఎస్.అస్లాంబాషా (నారాయణపురం పంచాయతీ), జయరాములు , తలారి బాబు (కళ్యాణదుర్గం), కె.సురేష్ (గరుడాపురం) నిందితులు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సుచరిత వాదనలు వినిపించారు.

26న బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 550కు పైగా మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని బలిజ విద్యార్థులకు ఈ నెల 26న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు టి.శంకరయ్య, కార్యవర్గ సభ్యులు మంగళవారం వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఆధార్‌కార్డు, మార్కుల జాబితా, టీసీ లేదా కులధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు జతచేసి ఈ నెల 24వ తేదీలోపు 'అధ్యక్షుడు, రాయలసీమ బలిజ సంఘం, శ్రీనివాసనగర్, అనంతపురం' చిరునామాకు పోస్టు ద్వారా లేదా, స్వయంగా అందజేయవచ్చు. పూర్తి వివరాలకు 98664 19693, 92477 92567, 94901 80177లో సంప్రదించవచ్చు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి

గుంతకల్లు: కదులుతున్న రైలు నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడిన ఘటన వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. వివరాలు... కర్ణాటకలోని వాడి ప్రాంతానికి చెందిన వెంకటేష్... బెంగళూరులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కర్ణాటకలో లోకసభ ఎన్నికలకు సంబంధించి బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు మంగళవారం బెంగుళూరు నుంచి నాంథేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో వాడికి బయలుదేరాడు. కల్లూరు–గుంతకల్లు సెక్షన్‌లోని వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ దాటి సుమారు 5 కి.మీలు ప్రయాణించిన తర్వాత బాత్రూంకు వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుంచి వెంకటేష్ జారి కిందపడ్డాడు. ఘటనలో తలకు, కాళ్లకు బలమైన రక్తగాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న గ్యాంగ్‌మెన్‌లు ఈ విషయాన్ని గుర్తించి వెంకటాంపల్లి రైల్వేస్టేషన్ మాస్టర్‌కు సమాచారం చేరవేశారు. స్టేషన్ మాస్టర్ నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

మాదిగల ద్రోహి మందకృష్ణ

- ఎంఆర్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిద్ది ఓబిలేసు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: మాదిగల ఆత్మాభిమానాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన మందకృష్ణ... మాదిగల ద్రోహిగా మారాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిద్ది ఓబులేసు ధ్వజమెత్తారు. మంగళవారం అనంతపురంలోని ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలు తన వెంటే ఉన్నారని గొప్పలు చెప్పుకుంటున్న మందకృష్ణ మాదిగ వైఖరిని తప్పుబట్టారు. మాదిగలకు న్యాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీలు కలిసికట్టుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మంద కృష్ణయ్య, నాగరాజు, ముత్యాలు, సూరి, జె.ముత్యాలు, ఆదిశేషు, గురుశంకరనారాయణ, చదువు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంగళమ్మచెరువులో టీడీపీ ఖాళీ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. మంగళవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువులో పలువురు ప్రముఖులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గంగన్న, నాగేష్, గణేష్, చిన్ని, రాజశేఖర్, సాయి, చంద్రాయుడు, రామాంజి, రాజేంద్ర, కిష్ట, గోవిందు, తదితర 20 కుటుంబాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ వెంకటేష్, నాయకులు హనుమంతరెడ్డి, ధారా శంకర్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం మంత్రి కార్యాలయం వద్ద మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి వారందరికీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్నే రావాలి


తిప్పేపల్లిలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

ఓడీచెరువు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే మళ్లీ రావాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జరికుంటపల్లి, తిప్పేపల్లి, తిప్పేపల్లి తాండా, వుంట్లవారిపల్లిలో ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలు వివరిస్తూ, కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దామోదర్ రెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు కుర్లి నరిసిరెడ్డి, రంగారెడ్డి, శంకరరెడ్డి, ఆది, కిష్టప్ప, బుడ్డయ్య, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం


వర్షం పడుతున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో మంగళవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో అల్లాడిపోయిన ప్రజలు వర్షం రాకతో ఉపశమనం పొందారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పోలీసులు మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో డబ్బు, మద్యం రవాణా కాకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ రహదారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేస్తున్నామన్నారు.

టీడీపీని బంగాళాఖాతంలో కలిపేద్దాం

- ఫ్యాన్ గాలికి సైకిల్ తుక్కవ్వాలి
- రోడ్‌షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలపించడం ద్వారా టీడీపీని బంగాళాఖాతంలో కలిపేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్ గుర్తుకు బటన్ నొక్కుతుంటే ఫ్యాన్ గాలికి సైకిల్ తుక్కై పోవాలన్నారు. నల్లమాడ బస్టాండ్ కూడలిలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను అధికారంలోకి రాగానే వందశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే గాక పేద పిల్లలకు సైతం ఇంగ్లిష్ విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని అమ్మఒడి, ఆసరా, రైతు భరోసా, జగనన్న విద్యాదీవె న, జగనన్న విద్యా వసతి, సున్నా వడ్డీ ఏ పథకం రావాలన్నా జగనన్న సీఎం కావాలన్నారు.

సేవకుడిగా పనిచేస్తా

స్థానికుడైన మీ బిడ్డ శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా మరొక్కసారి గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవకుడిలా పనిచేస్తానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపి వెనుకబడిన ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. ఎక్కడో పక్క జిల్లాలో కాపురం ఉంటూ చుట్టం చూపుగా నియోజకవర్గానికి వచ్చిపోయే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. పుట్టపర్తి అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ బ్యాలెట్ పేపర్లలో మూడో నెంబరుపై ఉండే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పాటలకు స్టెప్పులేసి జోష్ నింపిన ఎమ్మెల్యే

ప్రచారం రథం పైనుంచే జగనన్న పాటలకు స్టెప్పులేసి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో మరింత జోష్ నింపారు. అలాగే గాయని నిర్మల రాథోడ్ పాటలు పాడి అందరినీ అలరించారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగ్ జోనల్ ఇన్‌చార్జ్ డుంగావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో యాపిల్ పండ్లతో తయారు చేసిన గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. మండల నలుమూలల నుంచి రోడ్ షోకు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులకు నల్లమాడకు చెందిన యువ నాయకులు టీడీ క్రిష్ణ సుమన్‌డ్డి భోజన సదుపాయం కల్పించారు. ఇసుక వేసినా రాలనంత జనంతో బస్టాండ్ కూడలి కిక్కిరిసిపోయింది. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజినేయులు, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, కుళ్లాయినాయక్, పోలే వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి, మండల పరిశీలకులు బీఆర్ కేశప్ప తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి


పెమనకుంటపల్లి ప్రచారం చేస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి కోరారు. నల్లమాడ పంచాయతీలోని పెమనకుంటపల్లి, అప్పయ్యగారిపల్లిలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ మూడో నంబరులోని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అలాగే హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగనన్నతోనే జనరంజక పాలన సాధ్యమన్నారు.ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హయాంలో శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు నియోజకవర్గం మీదుగా మూడు జాతీయ రహదారులు సాధించుకున్నామన్నారు. ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని మరోసారి ఎన్నుకుంటే 193 చెరువులు నింపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తారని దుద్దుకుంట అపర్ణారెడ్డి తెలియజేశారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ , మహిళా విభాగం కన్వీనర్ చిన్నాదేవి, జిల్లా నేత మోదీనమ్మ, పీకేపీ తాండా సర్పంచ్ ఆనంద్‌నాయక్, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, ఎస్. ఆదినారాయణ రెడ్డి, గోవిందరెడ్డి, అంజినాయక్, పెద్ద రెడ్డెప్పరెడ్డి, పాల నరసింహులు, వెంకటరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, కిష్ట, శివయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టే


చింతమానిపల్లిలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట కిషన్‌రెడ్డి


రెడ్డివారిపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీచెరువు: ప్రతి ఎన్నికల్లో బూటకపు హామీలతో వచ్చే చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టేనని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి కోరారు. చింతమానిపల్లి, కమ్మవారిపల్లి, కాటమరెడ్డిపల్లి, గుర్రప్పపల్లి, బొమ్మిరెడ్డి చెరువు, మల్లొల్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచు జగన్‌మోహన్‌చౌదరి, ఎంపీటీసీ గణేష్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, నేతలు ఎద్దుల హనుమంతరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో స్థానిక నాయకులు మంగళవారం జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు ప్రతి ఇంటికీ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్న సీఎం కావాలన్నారు.

కారు బోల్తా

నల్లచెరువు: సంజీవిపల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సంజీవిపల్లి సమీపంలో మంగళవారం రాత్రి మదనపల్లి వైపు నుంచి అనంతపురం వైపు వెళ్లున్న కారు అతివేగంగా వచ్చి అదుపుతప్పి డివైడర్ ఢీకొని బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు.

సంక్షేమ సారథికి పట్టంకట్టండి

- టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మ


ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

గోరంట్ల: కుల,మత, రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటి ముంగిటమే సంక్షేమ ఫలాలు అందించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మ ప్రజలను కోరారు. మండల పరిధిలోని బూడిదగడ్డపల్లి, మీషన్ తండా, పొప్పనపల్లి తండా, మోట్రాపల్లి , కొత్తూరు, కల్లగేరి తండా, బెల్లాలచెరు, కాటిపల్లిపల్లి, రాగిమాకులపల్లి, సామలపల్లి, పాలసముద్రం గ్రామాల్లో మంగళవారం ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బూడిదగడ్డపల్లికి చెందిన ఎన్ఆర్ఐ శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం క్రేన్ సహాయంతో యాపిల్‌తో గజమాలతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఇప్పుడు మరోసారి ఆచరణకు సాధ్యం కాని హామీలు గుప్పిస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మకుండా ఓటుతో టీడీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు పెద్ద పీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితపై 16 చీటింగ్, ఫోర్జరీ, అక్రమ మట్టితరలింపు తదితర కేసులు ఉన్నాయని, ఆమెకు ఓటు వేస్తే పెనుకొండ అనుకొండగా మారుస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, పార్టీ మండల కన్వీనర్ గొల్ల లక్ష్మీనరసప్ప, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రాఘురామిరెడ్డి, నాయకులు శివారెడ్డి, పద్మనాభరెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

169 మందికి పోస్టల్ బ్యాలెట్

అమడగూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో 169 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి తెలిపారు. మండలంలో వివిధ శాఖల్లో పనులు చేస్తున్న ఉద్యోగులు ఎన్నికల విధుల నేపథ్యంలో పోస్టల్‌బ్యాలెట్ కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పటికే ఓటును వినియోగించుకున్నారని, మిగిలిన వారు తప్పనిసరిగా బుధవారం పుట్టపర్తికి వెళ్లి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటును వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల విధుల నిమిత్తం ఇప్పటికే డ్యూటీ ఆర్డర్‌ను తీసుకున్న వారు తప్పనిసరిగా పోలింగ్ విధులకు హాజరు కావాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ఊపిరి ఉన్నంత వరకూ జగనన్నతోనే..

- టీడీపీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవం
- నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్


విలేకరులతో మాట్లాడుతున్న ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: తన ఊపిరి ఉన్నంత వరకూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటాను. తాను టీడీపిలో చేరుతున్నట్లు ఓ యూట్యూబ్ ఛానల్ తప్పుడు వార్తను ప్రచారం చేసింది. దీనిపై కోర్టులో కేసు వేస్తాను' అని పెనుకొండ నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారక్‌ఖాన్ తెలిపారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరంట్లకు చెందిన ఓ యూట్యూబ్ ఛానల్‌లో తాను టీడీపీలో చేరబోతున్నట్లు తప్పుడు వార్తను ప్రసారం చేశారన్నారు. అది సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారిందన్నారు. జగనన్న భిక్షతో పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ పదవి తనను వరించిందన్నారు. అలాంటి గొప్ప నాయకుడికి అన్యాయం చేసి టీడీపీలో చేరే దుష్ట స్వభావం తనకు లేదన్నారు. తన అభిప్రాయం తీసుకోకుండా తప్పుడు కథనాలను ప్రసారం చేసిన ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు. సమావేశంలో కౌన్సిలర్ సుధాకరరెడ్డి, సద్దాం, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహా, రఘునాథరెడ్డి, రామాంజినేయులు, ముఖ్యనాయకులు రేపటి గణేష్, బోయబాబు, మారుతి, యాసిన్, నిషార్, శంకరరెడ్డి, కిష్టప్ప, నాయుడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి


రొద్దం మండలం రొప్పాలలో ప్రచారం చేస్తున్న నాయకులు


సోమందేపల్లి: మారుతీ నగర్‌లో ప్రచారం చేస్తున్న దృశ్యం


గుంతపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొద్దం: వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పి.రొప్పాల, పి.కొత్తపల్లి, పెద్దమంతూరు, చెరుకూరు, ఉప్పరపల్లి, లక్ష్మానిపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని ఓటర్లును అభ్యర్థించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.


మోదాలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పరిగి: మండల కేంద్రంతో పాటూ కొడిగెనహళ్లి, మోదా, శాసనకోట, శిరేకోళం, హొన్నంపల్లి, ఊటుకూరు, నరపాపురం, శ్రీరంగరాజుపల్లి, యర్రగుంట, విట్టాపల్లి, శీగిపల్లి, పైడేటి, బీచిగానిపల్లి పంచాయతీ గ్రామాల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీ చరణ్, శాంతమ్మ గెలుపు కోసం ఫ్యాను గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

గోరంట్ల: మండలంలోని 20 గ్రామ పంచాయితీల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలన్నారు. రాష్ట్రం జగనన్న చేసిన సంక్షేమాభివృద్ధిని వివరించి జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు.

పెనుకొండ రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్‌కు మరోమారు పట్టంకట్టాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి కోరారు. మంగళవారం మునిమడుగు పంచాయతీలోని మోటువారిపల్లిలో గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈవీఎం నమునాతో ఫ్యాను గుర్తుపై ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, సర్పంచ్ అశ్వర్థనారాయణ, వైస్ సర్పనంచ్ వెంకటరెడ్డి, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, వెంకటరాముడు, బైపురెడ్డి, రామాంజినేయులు, కాంట్రాక్టర్ రాము, నడిపి వెంకటరెడ్డి, దివాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిరెడ్డి, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని పందిపర్తి సర్పంచ్ ఎర్రమ్మ తెలిపారు. మంగళవారం సోమందేపల్లిలోని మారుతీనగర్‌లో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, వైస్ సర్పంచ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓడీచెరువులో రోడ్ షో

ఓడీచెరువు: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి రోడ్ షో నిర్వహించనున్నారు. ప్రముఖ సింగర్ నిర్మలా రాథోడ్ హాజరుకానున్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని మండల కన్వీనర్ రాజు నాయుడు కోరారు.

ఐకాన్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఐకాన్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ఐకాన్ జూనియర్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు లేవని, ముందస్తు ప్రచారాలు, ఫ్లెక్సీలు, బ్యానర్ల రూపంలో పట్టణంలో ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, పవన్, మహేష్, భగత్ తదితరులు పాల్గొన్నారు.